
# పాక్ క్రికెట్‌లో నవోదయం!

రేపటి నుంచి

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం




అది 1996 మార్చి 17. లాహోర్‌లో విల్స్ ప్రపంచకప్ (వన్డే) ఫైనల్. ఆస్ట్రేలియాను ఓడించిన అనంతరం శ్రీలంక సారథి అర్జున రణతుంగ వరల్డ్‌కప్ టైటిల్‌ను సగర్వంగా పైకెత్తుకున్నప్పుడు అక్కడున్న ఏ ఒక్క పాకిస్థానీ క్రికెట్ అభిమాని కూడా ఊహించి ఉండడు.. తమ దేశంలో మరో ఐసీసీ టోర్నీని ప్రత్యక్షంగా వీక్షించాలంటే ముప్పై ఏండ్లు ఆగాల్సి వస్తుందని! కానీ 2009లో ఇదే లాహోర్‌లో అదే శ్రీలంక క్రికెట్ జట్టుపై ఉగ్రమూకలు జరిపిన కాల్పుల ఘటనకు ఆ దేశం భారీ మూల్యమే చెల్లించుకుంది. ఒకానొక దశలో పాక్ క్రికెట్ భవిష్యత్తే ప్రశ్నార్థకమైంది. ఐసీసీ టోర్నమెంట్ సంగతి దేవుడెరుగు! కనీసం తమ దేశంలో పర్యటించేందుకు రావడానికే ఇతర జట్లు జంకే దుస్థితి. ఇతర దేశాల బోర్డులను బతిమాలి బామాలినా పాక్‌కు రాకపోయేసరికి చివరికి తటస్థ వేదికలలో తమ మ్యాచ్‌లను నిర్వహించుకోవాల్సిన దయనీయ పరిస్థితి. ఒకవైపు పక్కనే ఉన్న భారత్‌తో పాటు శ్రీలంకలో ఐసీసీ టోర్నీలు, ఐపీఎల్‌తో క్రికెట్ కళకళలాడుతుంటే పాక్‌లో మాత్రం ఒక తరం అభిమానులకు ద్వైపాక్షిక సిరీస్‌లనూ చూసే అవకాశమే లేకుండా పోయింది. ఫలితంగా ఆదాయం లేక పీసీబీ సంక్షోభ స్థితికి వెళ్లింది. దేశవాళీల్లో మ్యాచ్‌ల నిర్వాహణకూ డబ్బుల్లేని దుస్థితి! కానీ మూడు దశాబ్దాల సుదీర్ఘ విరామం తర్వాత పాక్.. ఒక ఐసీసీ టోర్నీకి ఆతిథ్యమిస్తోంది. ఎనిమిదేండ్ల విరామం అనంతరం చాంపియన్స్ ట్రోఫీ ఈనెల 19 నుంచి పాకిస్థాన్‌లో ప్రారంభం కానుంది. ఇది ఆ దేశ క్రికెట్ పునరుజ్జీవానికి కచ్చితంగా నవోదయమే! క్రికెట్‌ను అమితంగా ఇష్టపడే ఆ దేశంలో ప్రతిభావంతులైన క్రికెటర్లకు ఈ టోర్నీ ఎంతగానో స్ఫూర్తినింపుతుందనడంలో సందేహమే లేదు.

### పీసీబీ సామర్థ్యానికి కఠిన పరీక్ష

నిత్యం కలహాలు, ఉగ్ర దాడులు, అశాంతి, రాజకీయ అనిశ్చితి, ఆకలితో కొట్టుమిట్టాడుతున్న పాకిస్థాన్‌లో క్రికెట్‌కు పూర్వవైభవం తేవాలని యత్నిస్తున్న పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)కి ఈ టోర్నీ నిర్వహణ ఓ లిట్మస్ టెస్ట్ వంటిది. భద్రతా కారణాల రీత్యా భారత్.. పాక్‌లో ఆడేందుకు నిరాకరించడంతో ఆ దేశం భారీ ఆదాయాన్ని కోల్పోయింది. కాగా గతేడాది పాక్ మాజీ సారథి, పాకిస్థాన్ తెహ్రీక్–ఇ–ఇన్సాఫ్ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్‌ను అరెస్ట్ చేసి జైల్లో పెట్టడంతో అక్కడ చెలరేగిన అల్లర్లు ఇంకా పూర్తి స్థాయిలో చల్లారలేదు. ద్రవ్యోల్బణంతో అక్కడ జనం ఆకలితో అలమటిస్తూ ప్రభుత్వంపై గుర్రుగా ఉన్నారు. ఆందోళనకారుల ముసుగులో ఉగ్రమూకలు వారి ద్వారా చాంపియన్స్ ట్రోఫీకి ఆటంకం కలిగించే ప్రమాదమూ లేకపోలేదు. అయితే లాహోర్, కరాచీ, రావల్పిండిలో నిర్వహించబోయే ఈ టోర్నీని సాఫీగా జరిపించేందుకు పాకిస్థాన్ ప్రభుత్వం సుమారు 15వేల మంది భద్రతా సిబ్బందిని నియమించింది. వంద రోజుల్లోనే స్టేడియాలలో పునర్నిర్మాణ పనులను పూర్తి చేసిన పీసీబీ.. టోర్నీని ఏ మేరకు విజయవంతంగా నిర్వహిస్తుందనేది ఆసక్తికరం!

## కరాచీలో కనిపించని భారత పతాకం

**ఇక్కడకు రానందుకేనని అడ్డగోలు సమాధానం ● చాంపియన్స్ ట్రోఫీలో మరో వివాదం**

కరాచీ: ఎడతెగని చర్చోపచర్చలు, దాయాది బోర్డుల పట్టువిడుపుల నడుమ ఎట్టకేలకు 'హైబ్రిడ్ మోడల్'లో పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీలో మరో వివాదం! ఆదివారం ఈ టోర్నీ ఆరంభ వేడుకలలో భాగంగా కరాచీలోని నేషనల్ స్టేడియంలో చాంపియన్స్ ట్రోఫీ ఆడబోయే దేశాలతో పాటు సభ్య దేశాల జాతీయ జెండాలను ఉంచిన పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ).. మువ్వన్నెల భారత పతాకాన్ని మాత్రం పక్కనబెట్టింది. భారత మ్యాచ్‌లు దుబాయ్‌లో ఆడుతున్నా ప్రాతినిధ్య దేశం జెండాను ఎగురవేయడం ఆనవాయితీ. కానీ పాక్ మాత్రం భారత పతాకాన్ని ఎగురవేయలేదు. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారి పీసీబీ తీరుపై టీమ్ఇండియా అభిమానులు దుమ్మెత్తిపోశారు. ఈ నేపథ్యంలో పీసీబీ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'చాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లను పాకిస్థాన్‌లో ఆడేందుకు భారత జట్టు ఇక్కడికి రావడం లేదు. కరాచీ, లాహోర్, రావల్పిండిలో మ్యాచ్‌లు ఆడబోయే దేశాల జెండాలు మాత్రమే అక్కడ ఉన్నాయి' అని తెలిపాడు. అయితే భారత్‌తో పాటు బంగ్లాదేశ్ జెండా కూడా కరాచీలో కనిపించకపోవడంపై అతడే స్పందిస్తూ.. 'బంగ్లాదేశ్ జట్టు ఇంకా పాకిస్థాన్‌కు రాలేదు. ఆ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత్‌తో దుబాయ్‌లో ఆడుతుంది. అందుకే ఆ దేశ జెండాలను పాక్ స్టేడియాల్లో ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం పాకిస్థాన్‌లో ఉండి ఇక్కడి స్టేడియాల్లో మ్యాచ్‌లు ఆడబోయే దేశాల జెండాలే ఇక్కడ ఉన్నాయి' అని చెప్పడం గమనార్హం. దీనిపై పీసీబీ అధికారికంగా స్పందించాల్సిన అవసరం లేదని, కావాలనే పాకిస్థాన్ పరువును మంటగలిపే ప్రయత్నాలను కొందరు చేస్తున్నారని అతడు ఆరోపించాడు.



## మూడేండ్లు మ్యాగీ తిని బతికారు!

**పాండ్యా బ్రదర్స్‌పై నీతా అంబానీ ఆసక్తికర వ్యాఖ్యలు**



ముంబై: భారత క్రికెట్‌లో పాండ్యా బ్రదర్స్‌గా గుర్తింపు పొందిన హార్దిక్ పాండ్యా, కృనాల్ పాండ్యాపై ముంబై ఇండియన్స్ యజమాని, రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నీతా అంబానీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత జట్టుతో పాటు ఐపీఎల్‌లో గుర్తింపు రాకముందు ఈ సోదరులు పడ్డ కష్టాల గురించి ఆమె ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. 'ఐపీఎల్‌లో మాకు నిర్దేశిత బడ్జెట్ ఉంటుంది. కొత్త ఆటగాళ్లను గుర్తించేందుకు గాను మేం అప్పట్లో దేశవాళీ మ్యాచ్‌లు ఆడే వేదికలకు వెళ్లేవాళ్లం. నేనూ మా బృందంతో కలిసి రంజీ ట్రోఫీ మ్యాచ్‌లకు వెళ్లేదాన్ని. ఒకరోజు మా బృందం ఇద్దరు కుర్రాళ్లను తీసుకొచ్చింది. ఆ ఇద్దరూ బక్కపలచని శరీరంతో ఉన్నారు. నేను వాళ్లిద్దరితో మాట్లాడా. ఆర్థిక పరిస్థితుల కారణంగా గత మూడేండ్ల నుంచి తాము మ్యాగీ, నూడుల్స్ మాత్రమే తింటున్నామని వాళ్లు నాతో చెప్పారు. కానీ ఆట పట్ల వారికున్న నిబద్ధత, ఉత్సాహం, అభిరుచి, ఏదో సాధించాలనే తపన నన్ను ఆకట్టుకున్నాయి. ఆ ఇద్దరే హార్దిక్, కృనాల్. 2015లో హార్దిక్‌ను మేం రూ. 10 లక్షల కనీస ధరతో కొనుగోలు చేశాం. కానీ ఇప్పుడతడు ముంబై ఇండియన్స్ సారథి' అని తెలిపారు. 'ఆ తర్వాత ఏడాదే మా బృందం మరో యువ క్రికెటర్‌ను మా క్యాంప్‌నకు తీసుకొచ్చింది. అతడి బౌలింగ్ శైలి, బాడీ లాంగ్వేజ్ భిన్నంగా ఉన్నాయి. అతడు బంతితో మాట్లాడతాడు. అతడెవరో కాదు. ప్రస్తుత టీమ్ఇండియా స్టార్ పేసర్ బుమ్రా. రెండేండ్ల క్రితం మేం తిలక్‌వర్మనూ అలాగే గుర్తించాం. భారత జట్టుకు నాణ్యమైన క్రికెటర్లను అందించే నర్సరీగా ముంబై ఇండియన్స్ మారింది' అని ఆమె గర్వంగా చెప్పారు.

## విరాట్ కోహ్లీకి స్పెషల్ ఫుడ్



దుబాయ్: బీసీసీఐ తెచ్చిన కఠిన నిబంధనలు క్రికెటర్లకు ఒక రకంగా ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయా? అంటే అవుననే సమాధానం వినిపిస్తున్నది. ఇన్ని రోజులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరించిన క్రికెటర్లు ఇకపై బోర్డు నిబంధనలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. విదేశీ పర్యటనలకు కుటుంబాలతో సహా వచ్చిన క్రికెటర్లు ఈసారి సింగిల్స్‌గా రావాల్సి వచ్చింది. దీనికి తోడు వ్యక్తిగత చెఫ్‌లు, భద్రతా సిబ్బంది, సహాయకులు లేకుండా చాంపియన్స్ ట్రోఫీకి వచ్చిన ప్లేయర్లు ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. ఆహారం విషయంలో చాలా జాగ్రత్త వహించే కోహ్లీ..స్థానికంగా ఉండే ఓ ప్రముఖ హోటల్ నుంచి స్పెషల్ ఫుడ్ తెప్పించుకున్నట్లు తెలిసింది. ప్రాక్టీస్ సెషన్ కోసం సహచర క్రికెటర్లతో కలిసి వచ్చిన కోహ్లీకి ఫుడ్ డెలీవరి వచ్చింది. అంటే టీమ్‌తో కాకుండా విరాట్ ప్రత్యేకంగా ఆర్డర్ ఇచ్చి తెప్పించుకున్నట్లు ఓ ప్రముఖ వార్తాసంస్థ పేర్కొంది. కోహ్లీ చేతిలో ఒక బాక్స్ కనిపించడం దీనికి మరింత బలాన్ని చేకూరుస్తున్నది. మొత్తంగా చీఫ్ కోచ్ గౌతం గంభీర్ సంస్కరణలు టీమ్ఇండియా రూపురేఖలను మార్చేశాయని ఫ్యాన్స్ అనుకుంటున్నారు.



## ఖేలో ఇండియా వింటర్ గేమ్స్ వాయిదా

శ్రీనగర్: ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో భాగంగా ఈనెలలో జరగాల్సిన రెండో దశ పోటీలు వాయిదా పడ్డాయి. జమ్ము కశ్మీర్‌లోని గుల్మార్గ్ వేదికగా ఈనెల 22 నుంచి 25 దాకా ఈ పోటీలు జరగాల్సి ఉంది. అయితే గుల్మార్గ్‌లో ఈ క్రీడలకు తగినంత మంచు లేకపోవడంతో ఆటలను వాయిదా వేస్తున్నట్టు జమ్ముకశ్మీర్ స్పోర్ట్స్ కౌన్సిల్ సోషల్ మీడియా వేదికగా తెలిపింది. కొత్త తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వెల్లడించింది. గత నెలలో మొదటి దశ పోటీలకు లేహ్ ఆతిథ్యమివ్వగా తెలంగాణ రెండు స్వర్ణాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది.

# బెంగళూరు జోరు

**ఢిల్లీపై ఆల్‌రౌండ్ షోతో అలవోక విజయం ● మెరిసిన మంధాన, రేణుక**

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంపియన్స్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) జోరు కొనసాగుతోంది. తొలి మ్యాచ్‌లో ఈ టోర్నీలోనే భారీ లక్ష్యాన్ని ఛేదించిన ఆర్‌సీబీ.. రెండో మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌పై ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టింది. ఢిల్లీ నిర్దేశించిన 142 పరుగుల లక్ష్యాన్ని 16.2 ఓవర్లలోనే దంచేసింది. బెంగళూరు సారథి స్మృతి మంధాన (47 బంతుల్లో 81, 10 ఫోర్లు, 3 సిక్సర్లు) బౌండరీలు, సిక్సర్లతోమెరుపులు మెరిపించగా హాడ్జ్ (33 బంతుల్లో 42, 7 ఫోర్లు) ధాటిగా ఆడింది. మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 19.3 ఓవర్లలో 141 పరుగులే చేసింది. రోడ్రిగ్స్ (34) టాప్ స్కోరర్. రేణుకాసింగ్ (3/23), వర్హామ్ (3/25) ఢిల్లీ బ్యాటర్లను కట్టడిచేశారు.

### మం'ధనాధన్'

స్వల్ప ఛేదనలో ఆర్‌సీబీ ఓపెనర్లు మంధాన, వ్యాట్ హాడ్జ్ దంచికొట్టడంతో లక్ష్యం మరింత చిన్నదైంది. కాప్ మొదటి ఓవర్లోనే రెండు బౌండరీలు బాదిన మంధాన మిన్నుమణి 3వ ఓవర్లో మరో రెండు ఫోర్లు కొట్టింది. శిఖా 4వ ఓవర్లో వ్యాట్ సైతం బ్యాక్ టు బ్యాక్ బౌండరీలతో అలరించింది. ఈ ఇద్దరి జోరుతో 5 ఓవర్లకే ఆ జట్టు స్కోరు 50 పరుగుల మార్కును దాటింది. అదే జోరును కొనసాగిస్తూ ఈ ద్వయం బౌండరీల వర్షం కురిపించింది. 27 బంతుల్లోనే మంధాన అర్ధ సెంచరీ పూర్తిచేసింది. వ్యక్తిగత స్కోరు 34 పరుగుల వద్ద వ్యాట్ ఇచ్చిన క్యాచ్‌ను జెమీమా జారవిడిచినా మళ్లీ 11వ ఓవర్లో రన్నింగ్ క్యాచ్‌తో 107 పరుగుల తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. బెంగళూరు విజయానికి 9 పరుగుల దూరంలో మంధాన ఔట్ అయినా పెర్రీ (7 నాటౌట్), రిచా (11 నాటౌట్) లాంఛనాన్ని పూర్తిచేశారు.



మంధాన (81)

**సంక్షిప్త స్కోర్లు**

ఢిల్లీ: 19.3 ఓవర్లలో 141 ఆలౌట్ (జెమీమా 34, సారా 23, రేణుకా 3/23, వర్హామ్ 3/25); బెంగళూరు: 16.2 ఓవర్లలో 146/2 (మంధాన 47 బంతుల్లో 81, వ్యాట్ హాడ్జ్ 42, అరుంధతి 1/25, శిఖా 1/27)

## నేటి నుంచి జాతీయ పారాఅథ్లెటిక్స్ టోర్నీ

**బరిలో 1,476 మంది అథ్లెట్లు**

చెన్నై: చెన్నై వేదికగా ప్రతిష్ఠాత్మక జాతీయ పారా అథ్లెటిక్స్ టోర్నీకి మంగళవారం తెరలేవనుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 1500 మందికి పైగా అథ్లెట్లు ఈ టోర్నీలో పోటీపడుతున్నారు. స్థానిక జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా మొదలుకానున్న 23వ జాతీయ పారా అథ్లెటిక్స్ టోర్నీలో 30 జట్లు 155 ఈవెంట్లలో పతకాల కోసం బరిలోకి దిగనున్నాయి. దేశంలో అతిపెద్ద పారా టోర్నీగా భావిస్తున్న ఇందులో స్టార్ అథ్లెట్లు సుమిత్ అంటిల్, మనోజ్ సభాపతి, మనోజ్ సింగరాజ్, మరియప్పన్ తంగవేలు, ముతురాజా, నవ్‌దీప్‌సింగ్, యోగేశ్ కతునియా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. ఈ టోర్నీ కోసం తమిళనాడు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని పారాలింపిక్ కమిటీ ఆఫ్ ఇండియా(పీసీఐ) అధ్యక్షుడు దేవేంద్ర జఝారియా పేర్కొన్నాడు.

## భారీ స్కోరు దిశగా విదర్భ



నాగ్‌పూర్: రంజీ ట్రోఫీ ఎలైట్ 2024–25 సీజన్ సెమీస్ పోరులో భాగంగా డిఫెండింగ్ చాంపియన్స్ ముంబైతో జరుగుతున్న మ్యాచ్‌లో విదర్భ తొలి రోజు బ్యాటింగ్‌లో మెరిసింది. నాగ్‌పూర్‌లో సోమవారం మొదలైన మ్యాచ్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి విదర్భ 5 వికెట్ల నష్టానికి 308 పరుగులు చేసింది. ఆ జట్టు ఓపెనర్ ధ్రువ్ షోరె (74), డానిష్ మలెవార్ (79) అర్ధ సెంచరీలతో రాణించారు. యశ్ రాథోడ్ (47 బ్యాటింగ్), కెప్టెన్ అక్షయ్ (13 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ముంబై బౌలర్లలో దూబె (2/35), ములాని (2/44) తలా రెండు వికెట్లు తీశారు. ఇక అహ్మదాబాద్‌లో గుజరాత్‌తో జరుగుతున్న మరో సెమీస్‌లో కేరళ.. మొదటి రోజు 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. ఆ జట్టు సారథి సచిన్ బేబి (69 బ్యాటింగ్), అజారుద్దీన్ (30 బ్యాటింగ్) రాణించారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.